

మహిళా మృతదేహాల మిస్టరీ ఛేదనలో
పోలీసుల ముందడుగు

- ఆ ఇద్దరు మహిళలది హత్యే
- నిందితుని గుర్తించి అదుపులోకి..?
- మూడో మహిళ మృతదేహంపై రాని స్పష్టత

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగర శివారులోని నగరవనం సమీపంలో బయటపడిన మూడు మహిళ మృతదేహాల మిస్టరీని మెల్లమెల్లగా కర్నూలు జిల్లా పోలీసులు ఛేదిస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రశాంతంగా ఉన్న వాతావరణంలో ఒక్కసారిగా మూడు మహిళా శవాలు బయటపడడంతో నగర శివారులోని ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఈ ఘటన జిల్లాలో కలకలం రేపింది.

ఇద్దరు మహిళది హత్యే!!

చెరువులో తొలిగా రెండు మహిళా శవాలను గుర్తించారు. ఆ తరువాత మరికొద్దిసేపటికి ఆ ఘటనా స్థలానికి వంద మీటర్ల దూరంలో చెరువు గట్టున మరో మహిళ మృతదేహం బయటపడింది. తొలి జంట మహిళా మృతదేహాలది మాత్రం హత్యేనని పోలీసులు నిర్ధారించినట్లు తెలుస్తోంది. నిందితుడు కర్నూలు నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్‌గా గుర్తించారు. ఈ మేరకు సోమవారం నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలుస్తోంది. పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో అసలు వాస్తవాలు బయటపడినట్లు సమాచారం. తొలిగా బయటపడిన మహిళ మృతదేహాలు అరుణ, జానకి తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. మహిళ వ్యభిచార వృత్తికి తోడుగా ఉండేందుకు నిందితుడు ఆటో డ్రైవర్ బాషతో పరిచయం పెంచుకున్నారు. వారికి అవసరం ఉన్న చోటుకి తీసుకెళ్లి.. తీసుకొచ్చే విధంగా అందుకు తగిన మొత్తాన్ని అతనికి బాడుగ ఇచ్చేలా ఒప్పందం కుదరచుకున్నారు. కాలక్రమేణా బాషకు, అరుణకు మధ్య డబ్బు విషయంలో మనస్పర్ధలు రావడంతో వివాదం ఏర్పడింది. అరుణ తనకు తెలిసిన మనుషులతో బాషపై దాడి చేయించింది. ఇది మనసులో పెట్టుకుని ఉన్న బాషా శనివారం సాయంత్రం వారి పనిలో భాగంగా నగరవనానికి సమీపంలో ఉన్న చెరువుగట్టుకు తీసుకువెళ్ళాడు. అక్కడ బాగా మద్యం సేవించి ఉండగా అరుణతో మాటా మాట పెరిగి అరుణను చెరువులోకి తోసి వేశాడు. జానకి అడ్డు రావడంతో జానకిని కూడా చెరువులోకి తోసేసి అక్కడినుండి జారుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ ఘటనలో మరికొంతమంది నిందితుడికి సహకరించినట్లు సమాచారం పోలీసులు వారిని వేటాడే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది.

మూడో మహిళ మృతి హత్య..? ఆత్మహత్య..?

మహిళ జంట హత్యకు, గట్టుపై పడి ఉన్న మహిళ ఘటనకు సంబంధం లేనట్లుగా పోలీసులు భావిస్తున్నారు. కాగా మహిళ హత్య చేశారా లేక ప్రమాదానికి గురై మృతి చెందిందా అన్న విషయంలో పోలీసులు తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే చుట్టుపక్కల విచారించగా సదరు మహిళ కొద్ది రోజుల క్రితం ఆ పరిసర ప్రాంతాల్లో యాచిస్తూ కనిపించినట్లు స్థానికులు చెబుతున్నారు. మహిళా మృతదేహాల మిస్టరీ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న డిఐజి సిహెచ్ విజయరావు, ఎస్‌పి జి.కృష్ణకాంత్ జిల్లా పోలీసులను అప్రమత్తం చేశారు. మిస్టరీని ఛేదించే బాధ్యతను కర్నూలు టౌన్ డిఎస్‌పి విజయ శేఖర్‌కు అప్పగించారు. ఈ మేరకు మూడు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటుచేసి నిందితులను గుర్తించే పనిలోకి దిగారు. పోలీసులు ఈ కేసులో నిద్రాహారాలు లేకుండా ఘటన జరిగిన రెండు రోజులలోపే కేసును ఒక కొలిక్కి తెచ్చే దిశగా కృషి చేశారు. ఈ కేసులో పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేసినట్లు తెలుస్తోంది. కేసును ఛేదించేందుకు పోలీసులు ఆధునిక సాంకేతిక పద్ధతులను వినియోగించినట్లు తెలుస్తోంది. దీనిపై కూడా అతి త్వరలోనే పోలీసులు ఒక స్పష్టతను ఇచ్చే అవకాశం ఉంది. ఏది ఏమైనా పోలీసులు మూడు మృతదేహాల ఘటనల విషయంలో తీసుకున్న చొరవను, కృషిని ప్రజలు హర్షిస్తున్నారు. అతి తక్కువ సమయంలోనే కేసును ఓ కొలిక్కి తీసుకురావడాన్ని అభినందిస్తున్నారు.

గుంతలమయం...

- అధ్వానంగా మారిన రహదారులు
- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/విలేకరులు

గ్రామీణ రోడ్ల నుంచి ప్రధాన రహదారుల వరకూ అది ఏ రోడ్లయినా గుంతలు, గతుకులు కనిపించడం సాధారణం అయిపోయింది. వర్షాకాలం చిన్నపాటి వర్షానికి గుంతలు, బురదమయంగా మారుతున్న రహదారులు ఎండాకాలంలో కంకర తేలి గుంతలు, గతుకులతో దర్శనమిస్తున్నాయి. అధ్వాన్నంగా మారి వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పాలకులు అవే రోడ్లల్లో వెళుతున్నా వాటి మరమ్మతులు, కొత్త రోడ్ల మీద దృష్టి సారించడం లేదు...



అధ్వానంగా ఉన్న సి.బెళగల్ మండలం చింతమానుపల్లె రోడ్డు

కర్నూలు, నంద్యాల రెండు జిల్లాలు కలిపి 3,621.408 కిలోమీటర్ల మేర రోడ్లు ఉన్నాయి. వాటిలో 3,248 కిలో మీటర్ల బిటి రోడ్లు, 258.13 కిలోమీటర్ల సిసి రోడ్లు, 7.7 కిలోమీటర్ల మెటల్ రోడ్లు, 107.05 కిలో మీటర్ల అన్ మెటల్ రోడ్లు ఉన్నాయి. ఈ ఏడాది అధిక వర్షాల వల్ల సగానికి పైగా రోడ్లన్నీ రాళ్లు తేలడం, బురదమయంగా మారడంతో ఆయాదారుల గుండా ప్రయాణం చేసేందుకు వాహనదారులు, ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. తరచూ పాడయిన రోడ్లల్లో ప్రయాణించడం వల్ల వాహనదారులు వెన్ను, మెడ సంబంధ రోగాల భారిన పడుతున్నారు. కర్నూలు నగరంలోని రహదారులకూ అదే దుస్థితి దాపురించింది. **గోనెగండ్ల** మండలంలో గోనెగండ్ల నుంచి పెద్దమరివీడుకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారి ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. దశాబ్దాల క్రితం వేసిన ఈ రహదారికి 2009లో ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్స్ (ఎఫ్‌డిఎస్) కింద కొద్దిపాటి పనులు చేయడం తప్ప ఇంతవరకు ఎలాంటి మరమ్మతులూ చేయలేదని గ్రామస్తులు వాపోతున్నారు. పెద్దమరివీడు గ్రామ జనాభా సుమారు 5 వేలు. తహశీల్దార్ కార్యాలయం ఎంపిడిఒ కార్యాలయం, పోలీసు స్టేషన్‌తో పాటు వ్యక్తిగత కారణాలు, అవసరాలతో రోజూ వందలాది మంది గోనెగండ్ల ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తూ ఉంటారు. రహదారి గుంతలు పడి కంకర తేలడంతో ద్విచక్ర వాహనాలు ఆటోల్లో ప్రయాణించడానికి, రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **దేవనకొండ** మండలంలోని పుల్లాపురం నుండి తెర్నేకల్ గ్రామానికి వెళ్లే రహదారి అద్వాన స్థితికి చేరుకొని కంకర తేల డంతో ఆయా గ్రామస్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత అనేక ఏళ్ల క్రితం నిర్మించిన మట్టి రోడ్డు ఇప్పటివరకు ఎలాంటి మరమ్మత్తులు చేయలేదని గ్రామస్తులు వాపోతున్నారు.పుల్లాపురం నుండి తెర్నేకల్ గ్రామం వరకు 3 కిలోమీటర్ల రహదారి గుంతలు పడి కంకర తేలడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోల రాకపోకలకు పలు ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా రహదారి మధ్యలో కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అన్న భయాందోళనలో ఉన్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామస్తులు పండించిన పంట ఉత్పత్తులను ఎమ్మిగనూరు, ఆదోని మార్కెట్లకు తరలిస్తుంటారు. రహదారి కల్వర్టు అధ్వాన స్థితికి చేరుకోవడంతో పంట ఉత్పత్తులను కూడా తరలించలేని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోతున్నారు. బాలింతలు, గర్భవతులు వైద్యం చేయించుకోవడానికి వెళ్లాలంటే నరకం చవిచూస్తున్నామని వాపోయారు. **పెద్దకడబూరు** మండలంలో నిత్యం రద్దీగా ఉండే ఎమ్మిగనూరు - కోసిగి రహదారిలో ప్రయాణమంటే నరకంగా మారింది. మండల పరిధిలోని కమ్మలదిన్నె నుండి ఎమ్మిగనూరు వరకు రహదారి మొత్తం కంకరతేలి అడుగడుగునా గుంతల మయంగా మారింది. రహదారిలో ఎమ్మిగనూరు నుండి కోసిగి, ఉరుకుంద ప్రాంతాలకు నిత్యం ఆటోలు, మోటారు సైకిల్, బస్సుల ద్వారా ప్రయాణికులు ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. అడుగడుగునా గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏమాత్రం ఆదమరచిన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కనీసం గుంతలు పూడ్చలేని పరిస్థితిలో ఆర్అండ్‌బి అధికారులు ఉన్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కమ్మలదిన్నెలో ప్రధాన రోడ్డులోనే మోకాలు లోతు గుంతలు ఏర్పడ్డాయి. గతంలో కమ్మలదిన్నె నుండి ఎమ్మిగనూరు వరకు డబుల్ రోడ్డుకు నిధులు మంజూరైనా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. కమ్మలదిన్నెలో వాగుపై నిర్మించిన వంతెనకు కన్నాలు పడి ప్రమాదపు అంచున ఉంది. వర్షం వస్తే మరింత దారుణంగా తయారవుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిలో గుంతలు పూడ్చి రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. **సి బెళగల్** మండల కేంద్రంలో రోడ్డు ఆనవాలు కానరావడం లేదు. ఏళ్లుగా వర్షాకాలం వస్తే చాలు బురద బురదగా మారుతున్నాయి. అరడానికి రెండు లేదా మూడు రోజులు పడుతోంది. దీంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. చింతమాను పల్లె రోడ్డు మరీ ఆధ్వానంగా మారింది. వర్షానికి గుంతల్లో ఏ స్థాయిలో నిలిచి ఉన్నాయో తెలియక ప్రజలు, వాహనదారులు పడి లేచి వెళ్తున్నారు.

వేళకు గమ్యం చేరలేక పోతున్నాం



అవసరాలు తీరాలన్నా, పట్టణాలకు వెళ్లి రావాలన్న బెళగల్‌కు తప్పనిసరిగా చేరుకోవాలి. ప్రయాణం చేయాలంటే నరకంగా మారింది. రోడ్డు బాగాలేదు. అధికారులకు పట్టడం లేదు. అధిక సమయం అవుతోంది. వేళకు గమ్యం చేరలేక పోతున్నాము.

- హుసేన్ బీబీ, గొల్లల దొడ్డి, సి.బెళగల్ మండలం.

పట్టించుకొనే నాధులు కరవయ్యారు



బెళగల్ నుండి మా ఊరికి వెళ్లాలంటే చింతమాను పల్లి మీదుగా వెళ్ళాలి. సుమారు 9 కిలోమీటర్లు మేర బీటి రోడ్డు ఆనవాళ్లు లేవు. టు, త్రి, ఫోర్ వీలర్లు, ఇతర భారీ వాహనాలు పాట్లు పడితేనే గమ్యం చేరుకొంటాం. గత్యంతరం లేక వేరే దారి లేక అవస్థలుపడుతున్నారు. పలు చోట్ల కల్వర్టులకు రంధ్రాలు పడినా పట్టించుకొనే నాధులు కరవయ్యారు.

- వేణుగోపాల్ రావు, తిమ్మందొడ్డి, సి.బెళగల్ మండలం.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన. చిత్రంలో ఎస్పీ కృష్ణకాంత్, అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

జూన్ 1 నాటికి కౌంటింగ్ ఏజెంట్ల పేర్లు ఇవ్వాలి

- కౌంటింగ్ హాల్‌లోకి మొబైల్ ఫోన్ అనుమతించం - జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన

రాయలసీమ యూనివర్సిటీలో కౌంటింగ్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సజన రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. జూన్ 1 నాటికి కౌంటింగ్ ఏజెంట్ల పేర్లు ఇవ్వాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్, సమావేశం నిర్వహించారు.

వార్త 6లో

స్ట్రాంగ్ రూముల పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

స్థానిక రాయలసీమ యూనివర్సిటీలోని కంట్రోల్ రూంలో స్ట్రాంగ్ రూంల లైవ్ ఫీడ్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఇవిఎం యంత్రాలను భద్రపరచిన ఇంజనీరింగ్, లైఫ్ సైన్సెస్, లైబ్రరీ బ్లాక్‌లను, కౌంటింగ్ ఏర్పాట్లను కూడా ప్రవేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా ఎస్‌పి.జి.కృష్ణకాంత్, పాణ్యం రిటర్నింగ్ అధికారి నారపురెడ్డి మౌర్య, కర్నూలు రిటర్నింగ్ అధికారి భార్గవ తేజ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు చర్యలు చేపట్టండి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓట్ల లెక్కింపు ముందు తర్వాత శాంతి భద్రతలు కాపాడటానికి చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం సాయంకాలం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా విధానం గురించి తెలుసుకొని పోలింగ్ రోజున కొన్ని ప్రదేశాలలో విద్యుత్ అంతరాయానికి తీసుకున్న చర్యలు గురించి వాకబు చేశారు. ఓట్ల లెక్కింపు సమయంలో నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన స్పందిస్తూ... జిల్లాలో అనుమతులు మేరకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని తెలియ జేశారు. కర్నూలులో పట్టణంలో ఇంతకు మునుపు రోజు విడిచి రోజు ఇచ్చేవారమని ఇప్పుడు కొన్ని వార్డులు మినహాయించి మిగతా వాటికి ప్రతిరోజు నీటి సరఫరా చేస్తున్నామన్నారు. కర్నూలు పట్టణానికి 60 రోజులకు సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఈమధ్య వర్షాలు పడటం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో సమస్య తక్కువగా ఉందని అయినప్పటికీ తాగునీటి సరఫరా మెరుగు పరిచే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మిగనూరులో 15 రోజుల తర్వాత కొన్ని ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని దాన్ని ఇప్పటినుంచే అధిగమించడానికి అవసరం మేరకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని చీఫ్ సెక్రటరీకి తెలిపారు. డిఆర్ఒ మధుసూదన్‌రావు , జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ ఉమాపతి , ఇరిగేషన్ ఎస్‌పి రెడ్డి శేఖర్‌రెడ్డి , ఆర్‌డబ్ల్యుఎస్ఎస్‌సి నాగేశ్వరరావు , గనులశాఖ డిడిరాజశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షుడు బాబురావు

రాజీవ్ గాంధీకి ఘనంగా నివాళి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతిని మంగళవారం డిసిసి కార్యాలయంలో నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి డిసిసి అధ్యక్షుడు కె.బాబురావు ఇతర కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాబురావు మాట్లాడుతూ దేశంలో సమాచార వ్యవస్థను అభివృద్ధి చేయ డానికి కంప్యూటర్ రంగానికి పునాదులు వేసింది రాజీవ్ గాంధీ అని కొని యాడారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలలో సాంకేతికత పెంచి మరింత విస్తృతంగా ప్రజలకు సేవలు సత్వరమే అందేలా కృషి చేశా రన్నారు. మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు, మాజీ ఎమ్మెల్యే పి.మురళీకృష్ణ, ఖాసింవలి, స్టాండింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ పిజి.నరసింహులు యాదవ్, డిసిసి కోఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ అనంతరత్నం ,డిసిసి ఉపాధ్యక్షులు బి.బతుకన్న, డిసిసి ప్రధాన కార్యదర్శులు సయ్యద్‌నవీద్, కె.సత్యనారాయణ గుప్త, ఎన్.చంద్రశేఖర్, జిల్లా ఎస్‌సి సెల్ ఛైర్మన్ ఇ.లాజరస్, పాల్గొన్నారు.

తాగు నీటికోసం పందిపాడు ప్రజల ఆందోళన

3 రోజులుగా నిలిచిన నీటి సరఫరా - పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : మూడు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో కల్లూరు మంలడం పందిపాడు గ్రామస్తులు సోమవారం రాత్రి ఆందోళనకు దిగారు. ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. కర్నూలు కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాలలో పందిపాడు ఒకటి.ఈ గ్రామం 28వ డివిజన్ కిందికి వస్తుంది.మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఈ గ్రామానికి తాగునీరు సరఫరా చేయాల్సి ఉన్నా గాని గతంలో ఉన్న హంద్రీనది మోటార్ పంప్ సెట్టు ద్వారా ప్రజలకు నీరు సరఫరా చేస్తున్నారు. గత మూడు రోజుల క్రితం మోటార్ పంప్‌సెట్టుచెడిపోయింది. దానికి మరమ్మతులు చేయించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ముందుకు రాలేదు. గ్రామానికి చెందిన పూల శివన్న ఆరాధన మహోత్సవం గ్రామ శివారులోని పూలతోటలో నిర్వహిస్తున్నారు. ఈ ఆరాధన మహోత్సవానికి గ్రామంలోని ప్రతి ఇంటికి బంధుమిత్రులు వచ్చారు. వారందరికీ అవసరమైన నీరు సరఫరా లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి సమస్య తీవ్రంగా ఉండడంతో గ్రామస్తులు రాత్రి ప్రధాన రహదారిపైకెక్కి ఆందోళన చేపట్టారు. అధికారులు ప్రజాప్రతినిధుల తీరును తీవ్రంగా ఎండగట్టి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి మోటార్ కు పంప సెట్టుకు మరమ్మతులు చేయించి నీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరారు.



ఖాళీ బిందెలతో నిరసన

24 నుండి టెన్త్ సప్లమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఈనెల 24వ తేదీ నుండి టెన్త్ సప్లమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి కె. శామ్యూల్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా 69 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 17458 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

నాణ్యమైన విత్తనాలను అమ్మాలి : ఎఒ

ప్రజాశక్తి-సి బెళగల్: విత్తన దుకాణాలలో రైతులకు నాణ్యమైన విత్తనాలనే అమ్మాలని ఎఒ మల్లేష్ కుమార్ దుకాణదారులకు సూ చించారు. మంగళవారం మండలం లోని ఆయా దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాకు బోర్డును, రిజిస్టర్లను, బిల్లుల రికార్డులను పరిశీలించారు. ఇక్కడే ఖరీఫ్ వర్షాలు పడినందున, పంటలు సాగుచేసే పనిలో రైతులు నిమగ్నం అయ్యారని, ఇందులోనే నాణ్యమైన విత్తనాలు ఇవ్వాలన్నారు.

కేతవరం గార్గేయపురం మధ్య పైప్‌లైన్ పనులను ఆపాలి

-రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలి

-ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేతవరం గార్గేయపురం మధ్యలో జరుగుతున్న పైపులైన్ పనులను రైతులకు న్యాయమైన నష్టపరిహారం ఇచ్చే వరకు నిలిపి వేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. రామకృష్ణ నాయకత్వంలో మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, సిఐటియు మండల అధ్యక్షులు జి శ్రీధర్, స్థానిక రైతులు కలిసి పనుల వద్దకు వెళ్లి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఘాతాల(బ్లాస్టింగ్ చేయుట కొరకు) కొరకు గుంతలు తీస్తున్న , జెసిబి పనులను నిలిపివేశారు. జి.రామకృష్ణ మాట్లాడుతూ రైతుల అనుమతి లేకుండా రైతులకు ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా పనులను చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇది రైతులకు తీరని అన్యాయమన్నారు. గత సంవత్సరం రైతులందరికీ నోటీసు ద్వారా భూములు కోల్పోతున్న వారందరినీ తమ అభిప్రాయాలు తెలియజేయమని తెలిపారని, ఎవరెవరి భూమిప్రాజెక్టులో ఎంత పోతుందో రైతులు పూర్వపు ఆర్‌డిఒకు రాతపూర్వకంగా అర్జీ రూపంలో తెలిపారన్నారు. ఆ సందర్భంగా ఆర్‌డిఒ మీ భూములకు సరైన పరిహారం ఇచ్చి రైతుల ఖాతాల్లో నష్టపరిహారాన్ని వేసిన తర్వాతనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పుడేమో దానికి విరుద్ధంగా రైతులకు ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా యథేచ్ఛగా పైపులైన్ పనులను చేయడం అంటే రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని బెదిరించి పనులు చేయడం ఏమాత్రం సరైంది కాదన్నారు. అంతేకాక పనుల వద్ద ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టకుండా రోడ్డు పక్కలోనే 10 నుంచి 15 అడుగుల గుంత తీశారని రోడ్డుపైన వెళ్లే వాహనదారులు ప్రజలు ముఖ్యంగా పశువులు ఆ గుంతలో పడి చనిపోతున్నాయన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు,కలెక్టర్ స్పందించి రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలన్నారు. కేతవరం తాగునీటికి ఈ పైప్ లైన్ ద్వారా మంచినీళ్లు కుంటకు రెగ్యులర్‌గా నీళ్ల నింపాలన్నారు. కేతవరం నుండి గార్గేయపురం వరకు రోడ్డు అస్తవ్యస్తంగా ఉందని వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాజకీయాలతో సంబంధం లేకుండా రైతులను ప్రజలను కూడగట్టి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. పైపులైను పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. రైతులు వెంకటేశ్వర్లు, రంగస్వామి, బుగ్గరాముడు, నాగరాజు, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, శ్రీనివాసులు శెట్టి తదితరులు పాల్గొన్నారు.





ఉపాధి కూలీలకు అవగాహన

ప్రజాశక్తి-తుగ్గలి


తుగ్గలి మండలం రాతన గ్రా మంలో మంగళవారం గ్రామీణ ఉపాధి హామీ చట్టం లబ్ధిదారులకు వేసవిలో నీటి ఎద్దడి, నీటి కొరతపై కూలీలకు అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఎపిఒ రామకష్ణ , జల జీవన్ మిషన్ జిల్లా ప్రాజెక్టు పర్యవేక్షణా విభాగం సభ్యులు బి.లక్ష్మి నారాయణ వేసవిలో నీటి ఎద్దడిపై అవగాహనా కల్పించారు. ప్రతి ఒక్కరు భూగర్భజలాలు పెంపొందించడానికి కృషి చేయాలని, వర్షపు నీటిని పరిరక్షించాలని, చెట్లను పెంచాలని, ప్రతి కుటుంబం నీటి వినియోగం పై ప్రత్యేక శ్రద్ధ వహించా లన్నారు. ప్రతి కుటుంబం నీటి వినియోగంలో చిన్న చిన్న మార్పులు చేసు కున్నట్లయితే రోజుకి 300 లీటర్లు ఆదా చేయొచ్చని, చెడిపోయిన పైపులను , కుళాయిలను వెంటనే మరమ్మతులు చేసు కోవాలన్నారు. భూగర్భ జలాలను అభివృద్ధి చేయకపోతే రానున్న భవిష్యత్తు తరాల పరిస్థితి భయాన కంగా ఉంటుందని తెలిపారు. ఇంటి పైన ఉన్న ట్యాంక్ నుండి ఓవర్ ఫ్లోను అరికట్టాలన్నారు. నీటి వృథాపై,నీటి పొదుపు పై, నీటి విని యోగంపై, నీటి రక్షణ పై, నీటి సంరక్షణ పై, నీటి కాలుష్యం పై శ్రద్ధ వహించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహ, ఉపాధి హామీ లబ్దిదారులు హాజరయ్యారు.

హోమియో డాక్టర్ భర్తీ ఎప్పుడు?

-పట్టించుకోని వైద్యాధికారులు

-నెలలుగా అవస్థలు పడుతున్న దీర్ఘకాలిక రోగులు

ప్రజాశక్తి-సి బెళగల్



సి బెళగల్ మండలం పోలకల్ పంచాయతీ పరిధి చుట్టూ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నారని పోలకల్ మదర్ ఆసుపత్రిలోనే ప్రభుత్వం హోమియో ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. ఇక్కడ పని చేస్తున్న హోమియో వైద్యులు బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో నెలలు దాటినా వైద్యాధికారులు కొరత తీర్చడం లేదు. దీంతో దీర్ఘకాలిక రోగులు తీవ్ర ఇబందులు పడుతున్నారు. అక్కడి వైద్యులు లేని కారణంగా షుగర్, టిబి, బిపి, నరాల బలహీనత, కంటి జబ్బులు దగ్గు ఆయాసం, మానని గాయాలు, మహిళలకు ఆంగ్ల మందులు పడని రోగులు ఇలా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులుగా ఈ ఆసుపత్రికి రోజుకు 20 నుండి 30 వరకు వస్తుంటారు. ఈ హోమియో వైద్యం ఆరోగ్యానికి ఎలాంటి హాని కలిగించదని రోగుల నమ్మకం. ఈ చుట్టూ ప్రక్కల వారికీ హోమియో ఆసుపత్రి దిక్కుగా మారింది. ఇక్కడి వైద్యం ఆధారం చేసుకొని వస్తూ వెళ్తున్న రోగులు వైద్యులు బదిలీపై వెళ్ళారా లేక ఇక్కడికి రావడానికి అయిష్టంగా ఉన్నారా.. లేక వైద్యాధికారులు కొరత తీర్చని స్థితిలో ఉన్నారా అనేది తెలియడంలేదు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు తగు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఓట్ల లెక్కింపునకు సహకరించండి

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ కోరారు. మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జూన్ 4న జరిగే కౌంటింగ్ నిర్వహణపై ఈనెల చివరిలోపు ఫారం-18 ద్వారా



సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ



సమావేశానికి హాజరయిన అధికారులు, ఆయా పార్టీల ప్రతినిధులు

కౌంటింగ్ ఏజెంట్లు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆదోని నియోజకవర్గంలోని 256 పోలింగ్ కేంద్రాలకు గాను 14 టేబుళ్లపై 19 రౌండ్లు కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. ఈవిఎం మిషన్లు కౌంటింగ్ కంటే ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ లెక్కింపు జరుగుతుందని చెప్పారు. ఒక టేబుల్‌కు కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్లను జిల్లా ఎన్నికల అధికారి రాండమైజేషన్ పద్ధతి ద్వారా సిబ్బందిని కేటాయిస్తారన్నారు. ఈనెల 24, 31న కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇస్తారని తెలిపారు. తహశీల్దార్ హసీనా సుల్తానా, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ విజయ శేఖర్ రావు, డిఎల్‌పిఒ కార్యాలయపు పరిపాలన అధికారి వీరభద్రప్ప, సిఐలు నిరంజన్ రెడ్డి, గోపి, రాజకీయ పార్టీల ప్రతినిధులు నియాజ్ అహ్మద్, ప్రసాద్ రావు, నాగరాజు గౌడ్, కల్లుబోతుల రంగన్న, నాగరాజు, దస్తగిరి నాయుడు, సురేంద్ర యాదవ్, ఫయాజ్, అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్ హోల్స్

- వీధికొకటి ధ్వంసమైన మ్యాన్ హోల్ మూతలు



ధ్వంసమైన మ్యాన్ హోల్ మూత

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా తయారయ్యాయి. పట్టణంలో భూగర్భ మురుగు కాలువ కోసం ఏర్పాటు చేసిన మ్యాన్ హోల్స్ వీధికొకటి ధ్వంసమయ్యాయి. పట్టణంలోని హెచ్‌బిఎస్ కాలనీ, లక్ష్మం పేట, ఎస్‌ఎంటి కాలనీ, కటిక పేట, ఎన్‌టిఆర్ కాలనీ తదితర ప్రదేశాల్లో మ్యాన్ హోల్స్ మూతలు ధ్వంసమై ప్రమాదాలకు నిలయంగా మారాయి. వచ్చేది వర్షాకాలం.. భారీ వర్షాలు కురిస్తే ఆ నీటి ప్రవాహానికి మ్యాన్ హోల్ ఎక్కడుందో తెలియక పెద్దలు, చిన్నారులు, వాహనదారులు వెళ్తే తీవ్ర ప్రమాదాల గురయ్యే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పట్టణంలో ధ్వంసమైన మ్యాన్ హోల్స్‌ను గుర్తించి వర్షాకాలంలో ఎలాంటి ప్రమాదాలూ జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వెంటనే చర్యలు చేపట్టాలి

- సిపిఎం డివిజన్ కార్యదర్శి గోవిందు



పట్టణంలో భూగర్భ మురుగు కాలువ కోసం ఏర్పాటు చేసిన మ్యాన్ హోల్స్ ధ్వంసమైన వాటిని గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలి. రానున్నది వర్షాకాలం. ఎలాంటి ప్రమాదాలూ జరగకుండా మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి.

50 కిలోల గంజాయి స్వాధీనం

- ఆంధ్రాలో కర్ణాటక పోలీసుల దాడులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కర్ణాటక రాష్ట్రం బళ్లారి కోల్ బజార్ పోలీసు స్టేషన్ సిఐ ధర్మకర్, ఎస్ఐ వెంకటస్వామి తన సిబ్బందితో పాటు మండలంలోని సంతేకుడ్లూరులో మంగళవారం దాడులు చేశారు. 50 కిలోలకుపైగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి కోల్ బజార్ పోలీసు స్టేషన్ సిఐ ధర్మకర్, ఎస్ఐ వెంకటస్వామి వివరాల మేరకు... ఇటీవల బళ్లారి పరిధిలో గంజాయి అమ్మతూ పట్టుబడిన నిందితుని విచారించగా ఆదోని మండలం సంతేకుడ్లూరు గ్రామానికి చెందిన రవి, చంద్రలు అమ్ముతారని చెప్పాడు. రవి, చంద్రను అరెస్టు చేశారు. చిన్నగోనెహాళ్ గ్రామ పరిధిలో ఉన్న పొలంలో రవి, చంద్రలు గంజాయి సాగు చేసి గత రెండేళ్లుగా బళ్లారిలో విక్రయిస్తున్నారు. వారి ఇంట్లో సోదాలు చేయగా 50 కిలోల గంజాయి లభ్యమైంది. 6 సంచుల్లో విలువైన గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి, బళ్లారికి తరలించారు.



గంజాయితో పట్టుబడిన నిందితులు

గుట్టుచప్పుడు కాకుండా సొంత పొలాల్లో సాగు

సంతేకుడ్లూరు, చిన్నగోనెహాళ్ గ్రామ పరిధిలో ఉన్న పొలంలో రవి, చంద్రలు గంజాయి సాగు చేస్తున్నారు. గత రెండేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా, ఎవరికీ అనుమానం రాకుండా గంజాయి సాగు చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో అమ్ముతున్నట్టు కర్ణాటక పోలీసులు గుర్తించారు. ఆంధ్రా పోలీసులకు ఏమాత్రం అనుమానం రాలేదా, మామూళ్లు తీసుకొని వదిలేశారా అని గ్రామంలో చర్చ సాగుతోంది.





నిందితులు చంద్ర, రవి

ప్రాణాలకే ప్రమాదకరం

గంజాయి వాడకం అనేక అనర్థాలకు దారి తీస్తుందని వైద్యులు సూచిస్తున్నారు. బాధితుల్లో ఆందోళన, గుండె దడ, గుండెపోటు, మానసిక అనారోగ్య లక్షణాలు కనిపిస్తాయి. దీర్ఘకాలం గంజాయి తీసుకుంటే కానబనాయిడ్ హైపరమెసిస్ సింద్రోమ్ (సిహెచ్‌ఎస్) అనే రుగ్మతతో బాధపడతారు. పదే పదే వికారం కలుగుతూ వాంతులవుతాయి. కొన్ని సందర్భాల్లో అది మరణానికీ దారితీస్తుంది. ఒకటి, రెండు వారాలు గంజాయి తీసుకుని ఆపేసిన వారిలోనూ భయం, వణుకు, నిద్రలేమి, ఆకలి తగ్గడం, చెమటలు పట్టడం, మానసిక పరిస్థితి సవ్యంగా లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ద్రవ, స్ప్రే రూపంలో గంజాయి తీసుకుంటే తలనొప్పి, మగత, పొడినోరు, వికారం, మతిస్థిమితం దెబ్బతినడం వంటివి తలెత్తుతాయి. గంజాయిని పొగ రూపంలో సేవిస్తే ఊపిరితిత్తులు దెబ్బతింటాయి. దీర్ఘకాలంలో ప్రాణాలే పోతాయని వైద్యులు పేర్కొంటున్నారు.

అందరి సహకారంతో ఎన్నికలు ప్రశాంతం

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీ

ప్రజాశక్తి - మంత్రాలయం

అందరి సహకారంతో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని, సహకరించిన వారందరికీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.మురళీ ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ డాక్టర్ సృజన ఆదేశాలను అమలు చేయడంతో, ఎఈఆర్‌ఒలు శ్రీధర మూర్తి, మురళీ, అలెగ్జాండర్, ఇతర శాఖల అధికారుల కృషితో సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించారని చెప్పారు. ఈ నెల 13న జరిగిన పోలింగ్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా డీఎస్పీ సీతారామయ్య ఆధ్వర్యంలో సిఐలు ఎరిషావలీ, ప్రసాద్, ఇతర పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు చేపట్టారని కొనియాడారు. ఓటర్లు కూడా స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నారని, జిల్లాలోనే అత్యధికంగా ఓటింగ్ శాతం జరగడం శుభ పరిణామమని తెలిపారు. జూన్ 4న కౌంటింగ్ కూడా భారీ భద్రత మధ్య జరిగేలా కలెక్టర్ చర్యలు చేపట్టారని చెప్పారు. ఎన్నికల విజయవంతంలో పాలు పంచుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తహశీల్దార్ శ్రీధర్ మూర్తి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మురళీ



ఆలయ ప్రాంగణంలో ఉన్న జడ్జి

శ్రీమఠంలో హైకోర్టు జడ్జి నృపతి విజయ్

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి నృపతి విజయ్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, సహాయకులు బింధు మాధవాచార్ స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు వారికి శేష వస్త్రం అందజేశారు.

నరసింహస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని మాధవరం గ్రామంలో కొలువైన నరసింహస్వామిని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, సతీమణి కాచాపురం సర్పంచి జయమ్మతో కలిసి దర్శించుకున్నారు. మంగళవారం నరసింహ స్వామి జయంతి సందర్భంగా ఆయన ఆలయంలో విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు స్వీకరించారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రమాదాలు జరిగితేనే స్పందిస్తారా..?

- శిథిలావస్థలో ఫ్లైఓవర్ బ్రిడ్జి ఫుట్‌పాత్

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. ఈ బ్రిడ్జి మీదుగా నిత్యం కారులు, ఆటోలు, బైకులు, వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వందలాది మంది జనం వస్తూ, పోతుంటారు. అలాంటి ప్రాంతంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఫుట్‌పాత్ శిథిలావస్థకు చేరి హోల్ పడినా కనీసం మరమ్మతులు చేయని స్థితిలో అధికారులు ఉన్నారని పలువురు విమర్శిస్తున్నారు. ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతేనే స్పందిస్తారా అంటూ అధికారుల తీరుపై పురవాసుల అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పట్టణంలోని శ్రీనివాస భవన్ నుంచి తిమ్మారెడ్డి బస్టాండ్ వరకు పాత ఓవర్ బ్రిడ్జి ఉంది. ఈ రోడ్డు మీదుగా ఆలూరు, బళ్లారి, గుంతకల్లు ప్రాంతాలకు వాహనాల రాకపోకలు ఉండేవి. బ్రిడ్జి నిర్మించి 40 సంవత్సరాలు పూర్తి కావడంతో ప్రస్తుతం బ్రిడ్జి రూపురేఖలు మారి ప్రమాదటంచుల్లో ఉంది. ముందు జాగ్రత్త చర్యగా ఆ బ్రిడ్జి మీదుగా లారీలు, అధిక లోడుతో వచ్చే భారీ వాహనాల రాకపోకల నిషేధం చర్యకు బారికేడు నిర్మించి అధికారులు చర్యలు తీసుకున్నారు. సిరుగుప్ప, రాయచూరు, కోసిగి, కౌతాళం, ఉరుకుంద ప్రాంతాలకు చెందిన వారు రేణుకమ్మ హోటల్ వద్ద బస్సులు దిగి ఈ బ్రిడ్జి పైనుంచి పట్టణంలోకి రావాల్సి ఉంది. నిత్యం జనం నడిచే ప్రాంతంలోనే పోస్టాఫీస్ సైడు ఫుట్‌పాత్ హోల్ పడి ప్రమాదపుటంచున ఉంది. ఎవరైనా అదుపు తప్పి అందులో కాలు జారితే కిందపడి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. రాత్రి వేళలో వృద్ధులు అందులో పడే అవకాశం లేకపోలేదని పలువురు పేర్కొంటున్నారు. బహిరంగంగా హోల్ కనపడుతున్నప్పటికీ అధికారులు కనీసం పూడ్చే చర్యలు చేపట్టకపోవడం ఏమిటని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి



శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి



ఫ్లై ఓవర్ బ్రిడ్జి హోల్ పడి శిథిలావస్థలో ఫుట్‌పాత్



ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని సన్మానిస్తున్న ధర్మకర్త

వైభవంగా ఖాదర్ లింగస్వామి ఉరుసు ఉత్సవాలు

ప్రజాశక్తి - కౌతాళం

మతసామరస్యానికి ప్రతీకగా వెలసిన శ్రీజగద్గురు ఖాదర్ లింగస్వామి ఉరుసు ఉత్సవాలు వైభవంగా సాగాయి. మంగళవారం తెల్లవారుజామున గంధోత్సవం, అనంతరం భక్తులు దర్గాలో పూజలు నిర్వహించారు. ఆంధ్రా, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా ధర్మకర్త సయ్యద్ మున్నా పాషా ఏర్పాట్లు చేశారు. కర్ణాటకలోని బళ్లారి, సిరుగుప్ప, రాయచూర్, ఆదోని ఆర్‌టిసి డిపోల నుంచి బస్సులను భక్తుల కోసం నడిపించారు. శ్రీజగద్గురు ఖాదర్ లింగస్వామి సన్నిధిలో మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఆయన సతీమణి జయమ్మ, వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, ఎంపిపి అమ్రేష్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్, రామన్న గౌడ్, గురునాథ్‌రెడ్డి, ఎంకోబ తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. వీరికి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నా పాషా శాలువా వేసి సన్మానించి, ప్రసాదాలు అందజేశారు. అలాగే కౌతాళం సహకార సంఘం అధ్యక్షులు దాట్ల కృష్ణంరాజు, దాట్ల సుబ్బరాజు, రాఘవేంద్రరెడ్డి, అమరయ్య స్వామి, గణపతి రాజు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. వీరికి కూడా ధర్మకర్త సయ్యద్ మున్నా పాషా శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందజేశారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జూన్ 1 నాటికి కౌంటింగ్ ఏజెంట్ల పేర్లు ఇవ్వాలి

- కౌంటింగ్ హాల్ లోకి మొబైల్ ఫోన్ అనుమతించం

- జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీలో కౌంటింగ్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సజన రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. జూన్ 1 నాటికి కౌంటింగ్ ఏజెంట్ల పేర్లు ఇవ్వాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్, సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోటీల్లో ఉండే అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లను ఫార్మ్ -18 ద్వారా నియమించుకోవాల్సి ఉంటుందని, ఏ టేబుల్‌కు ఐతే కౌంటింగ్ ఏజెంట్ ను నియమించి ఉంటారో, ఆ టేబుల్ వద్దనే కౌంటింగ్ ఏజెంట్లు ఉండాలన్నారు. ఒక ఏజెంట్‌ను కేవలం ఒక టేబుల్‌కు మాత్రమే కేటాయించుకోవలసి ఉంటుందన్నారు. ఒకటి కంటే ఎక్కువ టేబుల్ లకు కేటాయించడానికి లేదని రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ రోజున కచ్చితంగా వారిని నియమించిన లెటర్, ఐడికార్డ్, డిక్లరేషన్ లెటర్‌లు తీసుకొని రావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్లు లోపలికి ప్రవేశం ఉండదని, యూనివర్సిటీలో పార్కింగ్ వద్ద ఏర్పాటు చేసిన మొబైల్ డిపాజిట్ సెంటర్‌లో మొబైల్ ఫోన్లను పెట్టాల్సి ఉంటుందన్నారు. రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్‌బ్లాక్, లైఫ్ సైన్స్‌బ్లాక్, లైబ్రరీ బ్లాక్‌లలో కౌంటింగ్ నిర్వహణకు 8 అసెంబ్లీ నియోజకవర్గాల కు సంబంధించి 16 కౌంటింగ్ హాల్‌లను ఏర్పాటు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. కర్నూలు, ఆదోని అసెంబ్లీ, పార్లమెంట్‌కు సంబంధించిన ఇవిఎం యంత్రాలను లైఫ్‌సైన్స్ బ్లాక్‌లో, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆలూరు, పాణ్యం అసెంబ్లీ, పార్లమెంట్‌కు సంబంధించిన ఇవిఎం యంత్రాలను ఇంజనీరింగ్ బ్లాక్‌లో, మంత్రాలయం, పత్తికొండ అసెంబ్లీ, పార్లమెంట్‌కు సంబంధించిన ఇవిఎం యంత్రాలను లైబ్రరీ బ్లాక్‌లో భద్రపరిచామన్నారు. ఎటువంటి కన్ఫ్యూజన్ లేకుండా ప్రతి ఫ్లోర్‌ను ఒక నియోజకవర్గానికి కేటాయించామని, సంబంధిత ఫ్లోర్ లోనే ఆయా నియోజకవర్గాల అసెంబ్లీ కౌంటింగ్, అసెంబ్లీ సెగ్మెంట్‌లోని పార్లమెంటు కౌంటింగ్ జరుగుతుందన్నారు. అందుకు గాను 2 కౌంటింగ్ హాళ్లను, 2 స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఇవిఎంలను గట్టి బందోబస్తు నడుమ పకడ్బందీగా రాయలసీమ యూనివర్సిటీలో మూడంచెల భద్రతతో భద్రపరచడంతో పాటు నిత్యం సిసి కెమెరాల ద్వారా కంట్రోల్ రూమ్ నుండి పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. అవసరమైతే రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా వెళ్లి చూసుకోవచ్చునని కలెక్టర్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌లు ఆయా నియోజకవర్గాల హెడ్ క్వార్టర్స్ సబ్ ట్రెజరీ కార్యాలయాలలోని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచామని, స్ట్రాంగ్‌కు ఒకటి లేదా కౌంటింగ్ ప్రక్రియ జూన్ 4వ తేది నాటికి చేరుస్తామన్నారు. 4న ఉదయం 8 గంటల నుండి ప్రారంభమవుతుందని, కౌంటింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది ఉదయం 7 గంటలకే కౌంటింగ్ హాలులో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రక్రియ సంబంధిత నియోజకవర్గాల అసెంబ్లీ కౌంటింగ్ హాల్ లోనే జరుగుతుందని, పాణ్యం, కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గాలకు 4 వేలు, 5 వేలు పోస్టల్ బ్యాలెట్లు ఉన్నందున ప్రత్యేక గదులను ఏర్పాటు చేసేందుకు అనుమతుల కొరకు ఎన్నికల కమిషన్‌కు పంపామని కలెక్టర్ పేర్కొన్నారు. కర్నూలు పార్లమెంట్‌కు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రక్రియ లైఫ్ సైన్స్ బ్లాక్ ప్రత్యేక రూమ్‌లో 14 టేబుల్స్ వేసి కౌంటింగ్ చేస్తామన్నారు.

జిల్లా నోడల్ అధికారిగా

డీఎస్పీకి అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి - ఆదోని

కర్నూలు జిల్లా నోడల్ అధికారిగా ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామి అదనపు బాధ్యతలు చేపట్టారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలో పశు సంరక్షణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. జంతువుల అక్రమ రవాణా, గోవధ తదితర హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జంతు సంరక్షణకు సంబంధించి ప్రత్యేక పర్యవేక్షకులుగా డీఎస్పీలు వ్యవహరించనున్నారని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాల వారీగా ప్రతి పోలీసు యూనిట్‌లో ఒక డీఎస్పీని నోడల్ అధికారిగా నియమించిందన్నారు. జంతు హింస, రవాణాకు సంబంధించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఆయా జిల్లాల ఎస్పీలు నోడల్ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారన్నారు. పశు సరంక్షణను విస్మరించి జీవ హింసకు పాల్పడే వారిపై జంతు సంరక్షణ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటారన్నారు.



డీఎస్పీ శివ నారాయణ స్వామి

పి.కోటకొండలో కార్డెన్ సెర్చ్

- కర్ణాటక, తెలంగాణ మద్యం స్వాధీనం

-ఒక వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - దేవనకొండ

ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు మండలంలోని పి.కోటకొండ గ్రామంలో మంగళవారం సిఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని 90 కర్ణాటక మద్యం ప్యాకెట్లు, 25 తెలంగాణ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ... అక్రమంగా మద్యం విక్రయాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



దేవనకొండలో మద్యం, వ్యక్తిని అదుపులో తీసుకున్న పోలీసులు

కర్ణాటక మద్యం పట్టివేత

ప్రజాశక్తి - నందవరం

అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు నాగలదిన్నె చెక్ పోస్ట్ వద్ద పట్టుకున్నారు. మంగళవారం ఎస్ఐ తిమ్మయ్య తెలిపిన వివరాల మేరకు... ఎమ్మిగనూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన గొల్ల రామకృష్ణ ద్విచక్ర వాహనంపై కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. నాగలదిన్నె చెక్ పోస్ట్‌లో తనిఖీ చేయగా 576 జాన్స్ ఒరిజినల్ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు, ఎపి 39 ఎల్‌వి 2606 గల ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనంలోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఎవరైనా అక్రమంగా మద్యాన్ని తరలించాలని ప్రయత్నం చేసినా, అక్రమ మద్యాన్ని అమ్మినట్లు తెలిసినా వారిపై కేసు నమోదు చేసి, జైలుకు పంపుతామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నందవరంలో పట్టుకున్న మద్యాన్ని చూపిస్తున్న ఎస్ఐ తిమ్మయ్య

దేవరను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్

ప్రజాశక్తి - చిప్పగిరి

సామరస్యంగా, అల్లర్లు సృష్టించకుండా ప్రశాంత వాతావరణంలో గ్రామ దేవరలు నిర్వహించుకోవాలని ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ తెలిపారు. మంగళవారం మండలంలోని నేమకల్లు పంచాయతీ మజరా గ్రామమైన సంగాల గ్రామంలో సుంకులమ్మ అవ్వ గ్రామ దేవర నిర్వహిస్తుండడంతో గ్రామంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ... గ్రామంలో పలు గ్రామాల నుంచి ఎంతోమంది బంధువులు వచ్చి ఉంటారని, అలాంటి సమయంలో కొందరు అల్లరి మూకలు తప్ప తాగి గొడవలు సృష్టిస్తుంటారని తెలిపారు. అలాంటివి ఏవైనా జరిగితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులను కోరారు. దేవర ప్రశాంతంగా జరగడానికి గ్రామ పెద్దలు, ప్రజలు సహకరించాలని తెలిపారు. పోలీసులు సాగర్, భాస్కర్, సుబ్రమణ్యం, శంకర్ పాల్గొన్నారు.



ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్